www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 1 జనవరి 2023
5
అన్నమయ్య



గెస్ట్‌హౌస్ పనులు వేగవంతం చేయండి

ప్రజాశక్తి - రాయచోటి

నూతనంగా నిర్మిస్తున్న గెస్ట్‌హౌస్ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి భవనాన్ని అప్పగించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ గిరీష ఆదేశించారు. శనివారం చురుగ్గా జరుగుతున్న గెస్ట్ హౌస్ భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి డిఇ సురేష్ నాయక్, రాయచోటి తహశీల్దార్ రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



గెస్ట్‌హౌస్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

కొత్త ఆశలతో..



- ఊరిస్తోన్న పరిశ్రమల స్థాపన
- ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపైనే ఆశలు
- నిర్వాసితుల పరిహారంపై మీనమేషాలు

కొత్త ఏడాది కోటి ఆశలతో స్వాగతం పలుకుతోంది. గడిచిన ఏడాది ఎలా సాగినప్పటికీ 2024 సార్వత్రిక ఎన్నికలు స్వాగతం పలుకుతున్న తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చాల్సిన హామీలపై ప్రజానీకం ఆశలు పెంచుకుతంది. 2023 నూతన సంవత్సరం పలువురి లక్ష్యాలకూ ఓ ల్యాండ్‌మార్క్‌గా నిలుస్తున్న విషయం అందరికీ విషయమే. అందరూ ఎవరికి వారు నిర్దేశిత లక్ష్యాలను అధిగమించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వమే ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు నడుంబిగించడం కొసమెరుపైనప్పటికీ ఆచరణపైనే అందరికీ సందేహాలు నెలకొన్న నేపథ్యంలో నూతన సంవత్సరం కొత్త ఆశలు రేపుతోంది. రైతుల ఆకాంక్షలను అధిగమించడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త ప్రణాళికలతో ముందుకు వస్తున్నప్పటికీ, ఉసురు తీసుకున్న రైతులకు పరిహారం పెంచినప్పటికీ అందరికీ అందని వైనం నివ్వెరపరుస్తోంది. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు మొదలుకుని సాగునీటి ప్రాజెక్టులకు సప్లయ్‌చానళ్ల సమస్య వేధిస్తుం డడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా గండికోట, మైలవరం, పైడిపాలెం, చిత్రావతి ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో నీళ్లను నిల్వ చేసినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఇదిలాఉండగా కొత్త ఏడాదిలో సంక్షేమ పథకాలు అమలవుతున్న నేపథ్యంలో జిల్లా వాసుల ఆశలు, ఆకాంక్షలు అంచనాల్ని మించి ఉన్నాయనడంలో సందేహం లేదు. ఏదేమైనా కొత్త ఏడాది కొత్త ఆశలన్నీ నెరవేరాలని ఆశిద్దాం.

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

జిల్లా ప్రగతి రథం నత్తనడకన సాగుతోంది. ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టడంతో ప్రగతి పరుగులు తీయడంపై ప్రజానీకం ఆశలు పెంచుకుంది. ఇటీవలి జిల్లా పర్యటనలో భాగంగా జనవరి నెలాఖరులో ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేయనుండడం మొదలుకుని రిమ్స్‌కు సూపర్ స్పెషాలిటీ సదుపాయంతోపాటు కేన్సర్‌కేర్, ఎల్‌వి ప్రసాద్ ఐ యూనిట్, మెంటల్ ఇన్స్టిట్యూట్‌తోపాటు రాజోలి, జొలదరాశి, కుందూ లిఫ్టు, జిఎన్ఎస్ఎస్-2 నుంచి రాయచోటికి లిఫ్టు మొదలగు పనులకు సుమారు రూ.12 వేల కోట్ల మేరకు శంకుస్థాపనలు చేసిన విషయం తెలిసిందే. అభివృద్ధి పనులను ఆచరణలో పెట్టి పరుగులు తీయించి, ఆచరణకు నోచుకునేలా చర్యలు తీసుకుంటేనే సార్థకత నెరవేరనుంది. వీటితోపాటు రాష్ట్ర ప్రభుత్వం యోగి వేమన యూనివర్శిటీకి నిధుల కొరత, కొత్త కోర్సులు ఏర్పాటు, ఫ్యాకల్టీ నియామకాలు, నందలూరులో ఉద్యానవన యూనివర్శిటీ ఏర్పాటు, జిఎన్ఎస్-ఎస్‌ఫేజ్-2 పనులు, ఒంటిమిట్ట కోదండరామాలయ మాస్టర్ ప్లాన్, ఐటిపార్క్ మొదలగు అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. కేంద్రం వెనుకబడిన నిధుల విడుదల పునరుద్ధరణ మొదలుకుని కొప్పర్తికి పర్యావరణ అనుమతి వరకు పెండింగ్‌లో పెట్టిన సంగతి తెలిసిందే. 2014 రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా కేంద్ర ప్రభుత్వం సెయిల్ ఆధ్వర్యంలో ఇంటిగ్రే టెడ్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాల్సి ఉంది. కేంద్రం మొండివైఖరిని అవలంభించడంతో రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకుని శంకుస్థాపన చేసింది. మూడేళ్లలో రూ.15 వేల కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు పేర్కొనడం, జనవరి నెలాఖరులో శంకుస్థాపన చేయనుండడం ముదావహం. కొప్పర్తి పారిశ్రామిక వాడకు పర్యావరణ అనుమతి లేకపోవడంతో జిల్లా పారిశ్రామిక ప్రగతి వెనుకబడిపోతోంది. పలితంగా వేలాది మంది నిరుద్యోగ యువత పొట్ట చేతబట్టుకుని గల్ఫ్ ఇతర పశ్చిమ దేశాలకు వలసవెళ్తోంది. దేశీయంగా నిరుద్యోగం పెరిగిపోతోంది. వీటికితోడు వ్యవసాయ రంగాభివృద్ధిలో కీలకమైన గండికోట, తెలుగుగంగ కాల్వల వెడల్పు పనులు, అన్నమయ్య రిజర్వాయర్ పునరు ద్ధరణ పనులు, జిఎన్ఎస్ఎస్-2 పనుల మొదలుకుని, ఉమ్మడిజిల్లాలోని 15 రిజర్వాయర్ల పరిధిలో ఏ ఒక్క ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు నీరందించే పరిస్థితి కనిపించడం లేదు. ఫలితంగా రిజర్వాయర్లలో నీళ్లు నిలిపినప్పటికీ సద్వినియోగం చేసుకునే అవకాశం లేకుండా పోతోంది. ఈ ఏడాది శ్రీశైలం రిజర్వా యర్ ఎనిమిది సార్లు నిండిన నేపథ్యంలో గండికోట, మైలవరం, పైడిపాలెం, చిత్రావతి, బ్రహ్మసాగర్, ఎస్ఆర్-1, ఎస్ఆర్-2 వంటి ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో అన్నమయ్య, పింఛా, ఎగువ సగిలేరు వంటి ప్రాజెక్టుల మరమ్మతులు ఎప్పటికి సాకారమవుతాయో తెలియని పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఇదిలాఉండగా గండికోట, సోమశిల, పైడిపాలెం, చిత్రావతి, సోమశిల ప్రాజెక్టుల పరిధిలోని నిర్వాసితులకు పరిహారం అందించాల్సిన అవసరం ఉంది. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికల నాటికైనా నిర్వాసితులు, పర్యావరణ అనుమతులు వంటి ప్రధాన సమస్యలు పరి ష్కారమై ప్రగతి రథం పరుగులు తీయాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

రక్తహీనత నివారణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

రక్తహీనతను దూరం చేయడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని వైద్యాధికారులను కలెక్టర్ గిరీష్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి అనీమియా టెస్టింగ్, వైద్య సిబ్బంది హాజరు, ఫ్యామిలీ పిజిషియన్, తదితర అంశాలపై డిప్యూటీ డిఎంహెచ్ఒలు, పిహెచ్‌సి, సిహెచ్‌సి, ఏరియా ఆస్పత్రుల డాక్టర్లతో కలెక్టర్ గిరీష్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిహెచ్‌సి, సిహెచ్‌సి, ఏరియా ఆస్పత్రి ముఖ ఆధారిత హాజరును పక్కాగా అమలు చేయాలని డాక్టర్లను ఆదేశించారు. ముఖ ఆదారిత హాజరను డిప్యూటీ డిఎంహెచ్ఒలు పర్యవేక్షణ చేయాలన్నారు. గర్భిణులు పరీక్షలు ఖచ్చితంగా చేయాలని మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. దేవపట్ల 45 శాతం, సుండుపల్లి 52 శాతం చేశారని, ఇంప్రూవ్ కావాలని సూచించారు. వచ్చేవారం కల్ల ప్రతి పిహెచ్‌సిలో రెండు హిమోగ్లోబిన్ పరికరాలను కొనుగోలు చేయాలని సూచించారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఆయా సచివాలయాలకు ముందుగానే ఏ గ్రామాలకు వెళ్లే షెడ్యూల్‌ను తెలియజేసి సచివాలయం ద్వారా టామ్ టామ్ వేయించాలన్నారు. ఇంటిదగ్గర డాక్టర్ వెళ్లి వైద్య సేవలు అందిస్తే రోగులల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. జనరల్ ఒపి 19,137, ఫీవర్ 603 కేసులు, తదితర ఒపి చూశారన్నారు. ప్రతి పిహెచ్‌సి నుంచి వెయ్యి ఒపి చూడాలన్నారు. పిటిఎం మెడికల్ ఆఫీసర్ క్యాన్సర్ రోగుల పట్ల మంచి వైద్య సేవలు అందించడంతో అభినందించారు. స్కూల్స్, హెూమ్, అంగన్వాడి కేంద్రాల విజిట్ చేసి డేటా ఎంట్రీ తప్పక చేయాలన్నారు. ఐరిస్క్ వుమెన్ చివరి వరకు వేచి ఉండకుండా ముందుగానే హాస్పిటల్ చేర్పించి మంచి సేవలు అందించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులకు సంబంధించి ఈకేవైసీ త్వరగా చేయించాలన్నారు. కోవిడ్ కేసు నమోదు అయితే వెం టనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. కోవిడ్ ప్రోటోకాల్ తప్పక పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో డిఎంహెచ్ఒ డాక్టర్ కొండ య్య, డిఎంహెచ్ఒలు, పిహెచ్‌సి, సిహెచ్‌సి, ఏరియా ఆస్పత్రుల డాక్టర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

పేదరిక నిర్మూలనకే నవరత్న పథకాలు : 'చింతల'



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పేదరికం నిర్మూలనకు నవరత్న పథకాలను ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నగిరిమడుగు పంచాయతీ పాతకోటపల్లి, శికారిపాళ్యెం, ముష్టుర్రువాండ్లపల్లి, కొత్తపల్లి, చిన్ననారాయణపల్లి, బురుజుగడ్డ గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి గడిచిన మూడున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, వాటితో కలిగిన ప్రయోజనాన్ని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సచివలయ వ్యవస్థతో చరిత్ర సృష్టించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళుతున్నారన్నారు. సుపరిపాలన, సంక్షేమ పథకాల అమలును చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, ఎఒ హేమలత, హౌసింగ్ ఎఇ సుబ్బారెడ్డి, ఇరిగేషన్ ఎఇ రామచంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ మిథున్ చక్రవర్తి, పంచాయతీ కార్యదర్శి అశ్విని, సర్పంచ్‌లు రజని, జయచంద్ర, నాయకులు చింతల ఆనందరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, సురేంద్రరెడ్డి, రాయుడు, ఆనంద, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వేడుకలకు ఎలాంటి అనుమతుల్లేవు
- ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు



మాట్లాడుతున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

నూతన సంవత్సర వేడుకలకు ఎలాంటి అనుమతులు లేవని అన్నమయ్య జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్ రాజు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరాలలో పట్టణంలో నూతన సంవత్సరానికి పురస్కరించుకొని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముఖ్యమైన ప్రదేశాలలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రశాంతమైన వాతావరణంలో కుటుంబ సభ్యులతో వేడుకలు నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. అర్ధరాత్రి కూడా అన్నమయ్య జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజల రక్షణ, భద్రతపై దృష్టి సారిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పై ప్రత్యేక దృష్టి చేపట్టామని మద్యం మత్తులో ఎలాంటి వాహనాలు నడపకూడదని ఆదేశాలు జారీ చేశారు. బహిరంగ ప్రదేశాలలో రోడ్డు కూడలలో గుమి కూడడం బహిరంగ పార్టీలు పెద్దపెద్ద శబ్దాలతో స్పీకర్లు డిజెలు పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగించరాదని సూచించారు. బార్లు, రెస్టారెంట్లు, హోటల్లో డ్యాన్సులు అలాగే అశ్లీల నృత్యాలు పూర్తిగా నిషేధించామని పేర్కొన్నారు. అసాంఘిక, అసభ్యకర కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని ముఖ్య కూడలలో పోలీస్ పికెట్‌లు, రాత్రి గస్తీలు నైట్ గస్తీ బృందాల నుంచి నూతన సంవత్సర వేడుకలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూసేలా నిరంతరం పోలీసు నిఘా ఉంటుందని చెప్పారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు

మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జనసేన కార్యాలయంలో శనివారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించి అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కేకుకట్ చేసి ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ జనసేనాని పవన్ కళ్యాణ్, రాజంపేట అసెంబ్లీ ఇన్‌చార్జి మలిశెట్టి వెంకటరమణ బడుగు బలహీన వర్గాలకు వెన్నుదన్నుగా ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం చేసే అలుపెరగని శ్రామికులని కొనియాడారు. కార్యక్రమంలో జనసేన చేనేత వికాస రాష్ట్ర కార్యదర్శి రాటాల రామయ్య, జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు కత్తి సుబ్బరాయుడు, భాస్కర్ పంతులు, బాల సాయి, గోపి, శంకరయ్య, ఆచారి, పోలిశెట్టి శ్రీనివాసులు, చంగల్ రాయుడు, జనసేన వీర మహిళలు జడ్డా శిరీష, గోవిందమ్మ, రజిత, మాధవి పాల్గొన్నారు.

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పీలేరు

2023 సంవత్సరం యుటిఎఫ్ డైరీ, క్యాలెండరును ఎంఇఒ బాలాజీ నాయక్ ఆవిష్కరించారు. శనివారం పీలేరు ఎంఆర్‌సి కార్యాలయం వద్ద అన్నమయ్య జిల్లా యుటిఎఫ్ పీలేరు మండలం పక్షాన డైరీ, క్యాలెండరు, స్టిక్కర్ క్యాలెండరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ అక్రమ్ బాష, జిల్లా సహాధ్యక్షులు శివా రెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట రమణా రెడ్డి, వేణు గోపాల్, జిఆర్‌కె, ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : 'మేడా'

ప్రజాశక్తి - వీరబల్లి

ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కన్వీనర్లు, వాలంటీర్లు సైనికుడిలా పనిచేయాలని శాసనసభ్యులు మేడా మల్లికార్జునరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు గాలివీటి రాజేంద్రనగర్ రెడ్డి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రాజంపేట శాసనసభ్యులు వెంకట మేడా మల్లికార్జున్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకే పాలన అందించడానికి సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టారని చెప్పారు. 50 కుటుంబాలకు ఒక వాలంటీర్ ఏర్పాటుచేసి ఇంటికే సంక్షేమ పథకాలు అందేలా పరిపాలన చేస్తున్నారని వివరించారు. సంక్షేమ పథకాలు అందరికీ అందాయా లేదా అని తెలుసు కునేందుకు ఒక్కొక్క సచివాలయానికి ముగ్గురిని కన్వీనర్లుగా నియమించామని చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, మండల నాయకులు వీరనాగిరెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు ఉమా మహేశ్వర్ రాజు, లాయర్ పవన్ కుమార్‌రెడ్డి, మాజీ ఎంపిపి నాగభూషణం, జడ్‌పిటిసి శివరాం గౌడ్, మాజీ ఎంపిటిసి సుబ్బరామరాజు, సొసైటీ అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డి, రామంజులరెడ్డి, సర్పంచులు, కన్వీనర్లు వాలంటీర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి

వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-పీలేరు

మండలంలోని ఓ గ్రామంలో వివాదాస్పద స్థలాన్ని రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి పరిశీలించారు. మండలంలోని మేళ్లచెరువు పంచాయితీ, కొత్తపల్లిలో వెంకట శివారాంరెడ్డి అనే వ్యక్తి రెండు ఇళ్లు నిర్మించుకుంటూ, అక్కడున్న బండి దారిని కూడా మోసేస్తూ అడ్డు గోడ నిర్మించడంతో గ్రామస్తులు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డిఒ శనివారం ఆ స్థలాన్ని పరిశీలించారు. విచారణలో గ్రామస్తులు ఇచ్చిన నివేదికను ఆర్‌డిఒ కలెక్టరుకు సమర్పించనున్నట్లు తెలిసింది. ఈ తనిఖీలో తహశీల్దార్ జి.రవి, ఆర్ఐ రాజశేఖర్, సర్వేయర్, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



స్థలాన్ని తనిఖీ చేస్తున్న ఆర్‌డిఒ రంగస్వామి

నోటీసులు జారీ చేయడం దుర్మార్గం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఒకపక్క జనవరి నుంచి పింఛను రూ.250 పెంచుతూ నిర్ణయం తీసుకుని మరో వైపు ఉన్న పింఛన్లు తొలగించేందుకు రంగం సిద్ధం చేసిందని, వాలంటీర్లు వైసిపి కార్యకర్తగా పనిచేస్తున్నారని డిసిసి మైనార్టీ అధ్యక్షులు ఆడిటర్ మన్సూర్ అలీఖాన్ పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి చాలా ఘోరంగా తయారైందని వాపోయారు. వంద మందికి రూ.250 పెంచితే అదనంగా రూ.250 వేలు భారం అవుతుందని భావించి ఆ వంద మందిలో పది మందికి పింఛను నిలిపేస్తే రూ.25 వేలు లోటును భర్తీ చేయొచ్చని ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించిందని పేర్కొన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల పక్షాన నిలబడి అర్హులందరికీ, పింఛన్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిరాశే
ప్రజా'దృష్టి'

జిల్లాలోని పలువురు పెన్షనర్లకు నోటీసులివ్వడం ఆందోళనను కలిగిస్తోంది. వృద్ధాప్యంలోని పండుటాకులు, ఏఆధారమూ లేని అభాగ్యులకు ఇచ్చే పింఛను తొలగించనుండడం పట్ల సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సిక్స్‌స్టెప్ వ్యాలిడేషన్ పేరుతో విద్యుత్ యూనిట్లలో పెరుగుదల మొదలుకుని 120 సిసి మోటార్‌బైక్, 10 ఎకరాలపైన మెట్ట, లేకఐదు ఎకరాల మాగాణి, నాలుగు టైర్ల వాహనం, ఆదాయ పన్ను, 1000 చదరపు అడుగుల విస్తర్ణంలో ఇళ్లు కలిగి ఉండడం వంటి నిబంధనల పేరుతో తొలగిస్తున్నామని నోటీసులు జారీ చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. సంక్షేమ పథకాల లబ్ధిదారులకు కాలం తీరిన గైడ్‌లైన్స్ ఆసరాతో భిక్షకులు మాదిరి చిన్నచూపుతో చూడడం క్షంతవ్యం కాదు. మారిన కాలానికి అనుగుణంగా జీవన ప్రమాణాలను పెంచడంతోపాటు గైడ్‌లైన్స్‌ను అప్‌డేట్ చేయకుండా కత్తిరింపుల పర్వానికి దిగడంలోని హేతువు ప్రశ్నార్థకంగా మారింది. విభజిత వైఎస్ఆర్ కడప జిల్లాలోని 2.51,277 లక్షల మంది సంక్షేమ పెన్షన్‌దారుల్లో 12,600 మంది పెన్షన్ తొలగింపును రుజువు చేసుకోవాలనే పేరుతో నోటీసులు జారీ చేయడం విస్మ యాన్ని కలిగిస్తోంది. ప్రతి ఆర్నెళ్లకోసారి పింఛన్‌దారుల ఆడిటింగ్ చేయాల్సిందే. కానీ మారుతున్న కాలానికి అనుగుణంగా సిక్స్‌స్టెప్ వ్యాలిడేషన్ గైడ్‌లైన్స్ అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉరుముతోంది. మారిన జీవన ప్రమాణాల నేపథ్యంలో ఇటువంటి గైడ్‌లైన్స్ ఆధారంగా నిర్ధారించడంలో ని ఔచిత్యమేమిటో వెల్లడించాల్సి ఉంది. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ వినియోగం విషయంలో గైడ్‌లెన్స్‌ను మార్చాల్సిందే. ఎందుకంటే మారిన వాతావరణ పరిస్థితుల్లో విద్యుత్ లేకపోతే ఊపిరి ఆడని పరిస్థితి కనిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్యాన్, కూలర్ వినియోగం తప్పనిసరిగా మారింది. జీవిత అవసరాల్లో కీలక భూమిక పోషిస్తున్న విద్యుత్ వినియోగాన్ని 300 యూని ట్లుగా నిర్ధారించడం హాస్యాస్పదంగా మారింది. ఇదేతరహాలో ఆధా ర్ నెంబర్‌కు ఎవరి భూములో, నాలుగు టైర్ల వాహనాలు లింక్ కావ డం అనేక ఘటనలు చూస్తూనే ఉన్నాం. ఇటువంటి తప్పిదాల వల్లే రుజువులు చేసుకోవడం పేరుతో పండుటాకులకు పింఛన్ నిలిపి వేస్తామనడం అభాగ్యుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జీవిత చరమాంకంలోని పండుటాకులు దా రులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి రుజువు చేసుకోవడం ఆచరణలో ఎంతవరకు సాధ్యమో పాలకులు ఆలోచనలు చేయాలి. జిల్లా వ్యాప్తంగా 12,600 పాత పింఛన్లను తొలగించడంలోని హేతు బద్ధతను మరోసారి ఆలోచన చేయాల్సి ఉంది. కొత్తగా మరో 8000 పింఛన్లు ఇవ్వడం సంగతి అలా ఉంచితే కత్తిరిం పుల సంగతే చరమాంకంలోని వృద్ధులను ఆందోళన కలిగిస్తోంది. అవ్వాతాతల పింఛన్‌ను దశల వారీగా పెంచుతూ పోతామనే హామీ బాగానే ఉంది, కానీ పెంచిన వనరులను పాతవాటి తొలగింపుల ద్వారా పూడ్చుకుంటున్నారనే విమర్శను ఎదుర్కోవాల్సి వస్తోంది. నిజమైన అనర్హులు ఉన్నారనే ప్రభుత్వ వాదనలో హేతుబద్ధత ఉన్నప్పటికీ అటువంటి వారి శాతాన్ని అతి తక్కువగా ఉన్నదనే సంగతిని మరువరాదని గ్రహించాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజా

పురపాలక వార్షిక బడ్జెట్‌కు ఆమోదం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ మనుజా అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ అత్యవసర సమావేశంలో కౌన్సిలర్లు ఆమోదించడంతో ముగిసింది. కౌన్సిల్‌లో ప్రవేశపెట్టిన 10 అంశాలను చదివి వినిపించడంతో అందరూ ఆమోదించారు. అంతకు మునుపు పురపాలక వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. మదనపల్లె పురపాలక వార్షిక బడ్జెట్ అంచనాలను తయారు చేశారు. 2029-24 సంవత్సరానికి సంబంధించి సవరించిన అంచనా బడ్జెట్ రూ.105.55 కోట్లుగా రూపొందించారు. రెవెన్యూ ఆదాయం కింద రూ.44.47 లక్షలు, మూలధనం కింద రూ.61.08 లక్షలు చూపించారు. ఇక నింబంధనల ప్రకారం తాగునీటి సరఫరా కోసం బడ్జెట్లో 25 శాతం, డ్రెయినేజీ నిర్వహణకు 15 శాతం, రోడ్ల నిర్వహణకు 20, వీధి దీపాల నిర్వహణకు 10 శాతం నిధులను బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. మూలధనం ఆదాయం గత ఏడాదితో పోల్చితే రూ.7.33 కోట్లు తగ్గింది. మొత్తం ఆదాయంలో రూ.96.47 కోట్లు ఖర్చు కింద చూపించి, అంతిమ నిల్వ కింద రూ.9.07 లక్షలు బడ్జెట్లో పొందుపర్చారు. పురపాలక సంఘానికి పన్నుల ద్వారా వచ్చే ఆదాయం కింద రూ.18.17 కోట్లు రాబడి ఉన్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. కార్మికుల జీతభత్యాలు రూ.10.94 కోట్లు, పరిపాలనపరమైన ఖర్చులు రూ.3.62 కోట్లు ప్రభుత్వ ప్లాను గ్రాంట్లు కింద రూ.61.08 కోట్లు రావచ్చని బడ్జెట్ లో పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జింక వెంకటాచలపతి, కమిషనర్ ప్రమీల, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో అధిక పరీక్షా ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలపై తగిన చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక చైతన్య డిగ్రీ కళాశాల వద్ద ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాకాయానికి సంబంధించి డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్ష ఫీజుకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. యూనివర్సిటీ విధించిన ఫీజులకు బదులుగా పీలేరు శ్రీచైతన్య డిగ్రీ కళాశాల అధిక మొత్తంలో ఫీజు వసూలు చేయడం ఏంటని ప్రశ్నించారు. యూనివర్సిటీ నియమనిబంధనలు పాటించకుండా అధిక ఫీజులు వసూలు చేసిన ఆ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా డిగ్రీ కళాశాలకు ఉండాల్సిన కనీస వసతులు కూడ లేవని ఆరోపించారు. విద్యార్థుల నుంచి వసూలు చేసిన అధిక ఫీజులు తిరిగి చెల్లించాలని అన్నారు. ఈ విషయమై తాము శ్రీచైతన్య డిగ్రీ కళాశాలపై యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సాయి సంపత్ కుమార్, హేమంత్, విశ్వ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎన్ఎస్‌యుఐ నాయకులు



నిరసన తెలుపుతున్న కార్మిక నాయకులు

ఆర్‌టిసి డిపోను పున:ప్రారంభించాలి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని బి.కొత్తకోటలో మూసివేసిన ఆర్‌టిసి డిపోను తిరిగి ప్రారంభించాలని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. డిపో మూసివేసి 16 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా శనివారం డిపోకు 16వ వర్ధంతి పేరుతో వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. కార్మికుల నిరసనకు పట్టణ ప్రజలనుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా కార్మిక నాయకులు యస్.బషీర్‌ఖాన్ మాట్లాడుతూ 2006 సంవత్సరంలో అధికారంలో ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా నష్టాలలో ఉన్నటువంటి ఆర్‌టిసి డిపోలు మూసివేయాలని నిర్ణయించిందని అన్నారు. అప్పటి ఉమ్మడి రాష్ట్రంలోని 14 డిపోలను మూసివేశారని, అందులోని కొన్నింటిని తిరిగి ప్రారంభించారని తెలిపారు. బి.కొత్తకోట డిపోను మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారని ఆవేదన చెందారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి నగర పంచాయతీకి జరుగబోవు ఎన్నికలలోపు ప్రత్యేక చొరవ చూపి డిపోను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక నాయకుడు యస్.సలీంభాష మాట్లాడుతూ ఆర్‌టిసి డిపో లేనందు వల్ల పరిసర గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్. సమీవుల్లా, గంగులప్ప, బాబు, కె.బాలకృష్ణ, ఎస్.గఫూర్, ఎస్.షబ్బీర్, కదిరప్ప, మోదిన్, కిష్టప్పగంగాద్రి, ఎస్.మస్తాన్‌వల్లిసాబ్, పాల్గొన్నారు.

పుంగనూరుకు బస్సు ఏర్పాటు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల కేంద్రమైన నిమ్మనపల్లె నుంచి పుంగనూరుకు ఆర్‌టిసి బస్సు సౌకర్యాన్ని పుంగనూరు ఆర్‌టిసి డిపో అధికారులు ఏర్పాటు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా నిమ్మనపల్లె నుంచి పుణ్యక్షేత్రమైన బోయకొండ మీదుగా పుంగనూరుకు, నిమ్మనపల్లె నుంచి వాల్మీకిపురంకు బస్సు సౌకర్యం లేక ప్రజలు ప్రయాణించాలంటే అవస్థలు పడుతూ వచ్చారు. పలుమార్లు ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకుపోగా అధికారులు స్పందించి ప్రస్తుతం పుంగనూరు డిపో నుంచి బోయకొండ మీదుగా నిమ్మనపల్లెకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం రోజుకు మూడు ట్రిప్పులలో బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. అలాగే నిమ్మనపల్లి నుంచి వాయల్పాడు, గుర్రంకొండ మీదుగా జిల్లా కేంద్రమైన రాయచోటికి కూడా బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పశువైద్యాధికారులపై ఆరోపణలు తగవు

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

మండలంలోని విపిఆర్ కండ్రిక పశువైద్యశాల పరిధిలో సక్రమంగా విధులు నిర్వహిస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ నాగశిరీషపై అసత్య ఆరోపణలు తగవని ఆస్పత్రి పరిధిలోని రైతులు కుమారస్వామి, అమర్నాథరెడ్డి నరేష్‌కుమార్‌రెడ్డితో పాటు మహిళలు, పాడి రైతులు అధిక సంఖ్యలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ నాగశిరీష, డాక్టర్ ప్రతాప్ దంపతులు పశువులకు సంబంధించిన సమస్యల కోసం ఏ సమయంలో ఫోన్ చేసినా వెంటనే స్పందించి పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. ఉర్లగట్టుపోడు కాపుపల్లెకు చెందిన కొందరు డాక్టర్ శిరీషకు ఫోన్ చేసినా స్పందించడం లేదని అసత్య ఆరోపణలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. రైతు సలహా మండలి జిల్లా చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి ఎంపిడిఒ కార్యాలయం వద్దకు రాగానే పాడి రైతులు, మహిళలు పశు వైద్యులు అందిస్తున్న సేవలు గురించి ఆయనకు వివరించారు. కార్యక్రమంలో వైసిపి దళిత నాయకులు ఆర్‌వి.రమణ, రాజశేఖర్, పాడిరైతులు పాల్గొన్నారు.

నేడు వైకుంఠ ద్వార దర్శనం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కోసూవారిపల్లి గ్రామంలోని శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో ఆంగ్లసంవత్సర, వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను పునస్కరించుకొని టిటిడి వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకటవ తేదీ ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు దర్శనాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు వైకుంఠ ద్వార దర్శనం జరుగుతుందని తెలిపారు. భక్తులందరూ కోవిడ్ -19 నీ దృష్టిలో ఉంచుకొని మాస్కులు ధరించి స్వామివారి దర్శనానికి రావాలని ఆలయ అర్చకులు రమేష్ బాబు, రాఘవేంద్ర, ఆలయ ఇన్స్పెక్టర్ రెడ్డి భాస్కర్ తెలిపారు.

సేవా ట్రస్ట్‌కు విరాళం

ప్రజాశక్తి-నందలూరు

నందలూరులోని సౌమ్యనాథ స్వామి ఆలయం వద్ద ఉన్న సౌమ్యనాథ సేవ ట్రస్ట్ నిత్య అన్నదానానికి కీర్తిశేషులు గూడూరు ఎల్లమరాజు జ్ఞాపకార్థం కుమారుడు గూడూరు మధుసూదన్ రాజు రూ.30516లు శాశ్విత చందా విరాళం ట్రస్ట్ అధ్యక్షులు ఎద్దుల సుబ్బరాయుడు, కోశాధికారి చక్రాల రామసుబ్బన్నకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎద్దుల సుబ్బరాయుడు మాట్లాడుతూ భక్తుల సహకారంతో నూతన సంవత్సరం ఒకటవ తేదీ,వైకుంఠ ఏకాదశి రెండవ తేదీ, భక్తులకు భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గంటా వాసుదేవయ్య, పల్లె సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

యువగళం జయప్రదం చేద్దాం

ప్రజాశక్తి-రామాపురం

రాష్ట్రవ్యాప్తంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జనవరి 27 నుండి చేపట్టే యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలని మండల టిడిపి క్లస్టర్ ఇంఛార్జ్ రామకృష్ణ గౌడ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం రామాపురం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యలు, వైసిపి అవినీతి పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నారా లోకేష్ పాదయాత్రకు పూనుకున్నారని అన్నారు. సమావేశంలో నాయకులు సహదేవరెడ్డి, వెంకట్రామిరెడ్డి, రాంబసిరెడ్డి, సుభాన్ బాషా, సుబ్బయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదర్శ ఎస్‌డబ్ల్యూపిసిలుగా తీర్చిదిద్దాలి : డిపిఒ

ప్రజాశక్తి-రామాపురం

గువ్వలచెరువు ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని గువ్వలచెరువు కసిరెడ్డిగారిపల్లె గ్రామ సచివాలయాలను డిపిఒ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గువ్వల చెరువులోని ఘన వ్యర్థపదార్థాల సంపద నిర్వహణా కేంద్రాన్ని పరిశీలించి వర్మీ కంపోస్టు తయారీ విధానం అమల్లోకి తేవాలని సూచించారు. కసిరెడ్డిగారిపల్లె సచివాలయాన్ని సందర్శించి రికార్డులను, నవరత్నాలకు సంభందించిన పోస్టర్లను పరిశీలించారు. సచివాలయం సిబ్బంది యూనిఫాం వేసుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. షోకాజ్ నోటీసులు ఇవ్వమని విస్తరణాధికారి సూచించారు. మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఇంటి పన్నులు, ఎస్‌డబ్ల్యుపిసి ఆక్టివిటీస్ ఆన్లైన్ చేయుట, గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయుట, ప్రభుత్వ పథకాల అమలుపై చర్చించారు. కార్యక్రమంలో కసిరెడ్డిగారిపల్లి, గువ్వలచెరువు సర్పంచులు, ఎంపిడిఒ హైదర్ వలీ, ఉషారాణి పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.



గువ్వలచెరువు ఎస్‌డబ్ల్యుపిసిని పరిశీలిస్తున్న డిపిఒ

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రాష్ట్రంలో వైసిపి అధికారం చేపట్టినప్పటి నుండి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ అండగా నిలబడుతున్నాడని మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శనివారం నిమ్మనపల్లిలో ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో నియోజకవర్గ పరిశీల కులు హబీబుల్లా ఖాన్‌తో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. సైషావలి దర్గాకు వెళ్లడానికి రూ.2 కోట్లవ్యయంతో రోడ్డును ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. మెడికల్ కళాశాలకు రూ.500 కోట్లతో నిర్మాణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. హబీబుల్లా ఖాన్ మాట్లాడుతూ సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలు విశేషంగా పనిచేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి నరసింహులు, వైసిపి మండల ఇన్‌ఛార్జ్ ఐ.రమణారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్ రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, మండల నాయకులు కొమ్మేపల్లి శ్రీనివాసులు రెడ్డి, బాబు రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్‌రఫీ, సర్పంచులు, ఎంపిటిసిలు కార్యకర్తలు పాల్గొన్నారు. **సుండుపల్లి :** ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు ప్రజలకు అందేలా చేయడంలో సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లదే కీలక పాత్రని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎంసిఆర్ కళ్యాణ మండలంలోని సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్ల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్ భాష

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ



నందలూరు : ట్యాబ్‌లతో విద్యార్థులు

ప్రజాశక్తి - రామసముద్రం

ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యకు బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా పేర్కొన్నారు. శనివారం మండలంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో ఎమ్మెల్యే చేతులు మీదుగా మండల వ్యాప్తంగా 8వ తరగతి చదువుతున్న 672 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో సాంప్రదాయ పద్దతుల్లో కాకుండా సరికొత్త ఇ-లెర్నింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సిఎం జగన్ ట్యాబ్‌లను పంపిణీ కార్యక్రమం తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మునిస్వామినాయక్, ఎంఇఒ హేమలత, తహశీల్దార్ విశ్వేశ్వర శాస్త్రి, ఎంపిడిఒ సురేష్ బాబు, మండల కన్వీనర్ భాస్కర్ గౌడ్, ఎంపిపి కుసుమకుమారి, వైస్ ఎంపిపి రమణా రెడ్డి, గంగాధర్‌నాయుడు, కేశవరెడ్డి, దొడ్డిపల్లి ఆనంద్, పాఠశాలకమిటీ ఛైర్మెన్ గుణశేఖర్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **నందలూరు :** మండ లంలోని నల్ల తిమ్మయ్య గారిపల్లి ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు సర్పంచ్ గీతాల శిరీష నరసింహారెడ్డి ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అన్నదానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణ పరిధిలోని ఊటుకూరు గ్రామ యువకుల ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ పరిధిలోని పేదలను, యాచకులను ఎంచుకుని ఆర్‌టిసి బస్టాండు, రైల్వేస్టేషన్ వంటి ప్రధాన ప్రాంతాలలో వారు ఉన్నచోటకే వెళ్లి భోజన ప్యాకెట్లను పేదలకు అందజేశారు. ఈ సందర్భంగా ఊటుకూరు యువత మాట్లాడుతూ గ్రామప్రజల సహ కారంతో యువకులంతా ఐకమత్యంతో గత మూడు వారాలుగా ప్రతి శనివారం పేదలకు అన్నదానం నిర్వహించడం జరుగుతోంని తెలిపారు. కార్యక్రమాన్ని నిరాటంకంగా కొనసాగించాలన్నదే తమ ఆకాంక్ష అని అన్నారు. పేదలకు పట్టె డన్నం పెట్టడంలోనే ఆత్మసంతృప్తి ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో సికిందర్, యు.హరికృష్ణ, రవి శేఖర్ రాజు, శివ, మోహన్, అఖిలాష్, మనోజ్ హరికృష్ణ పాల్గొన్నారు



కొండపై కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

హార్సిలీహిల్స్‌లో పటిష్ట పోలీసు బందోబస్తు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో పటిష్ట భద్రతను ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ న్యూ ఇయర్ వేడుకలకు హార్సిలీహిల్స్ కు పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సుమారు 40మంది సిబ్బందితో గస్తీ నిర్వహిస్తున్నామని చెప్పారు. కొండపైకి వెళ్లే ప్రతి ఒక్క వాహనాన్ని కొండ కింద ప్రాంతంలో టోల్ గేట్ వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేసి పైకి అను మతిస్తున్నామని అన్నారు. కొండపైకి వెళ్లే పర్యాటకులు మందు, గుట్కా లాంటి నిషేధిత వస్తువులను తరలిస్తే ఎటువంటి పరిస్థితుల్లో కూడా అను మతించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో కొత్త సంవత్సరం వేడుకలు జరుపుకోవాలని ఆయన సూచించారు.

అనాథలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మన సంస్థ ప్రతినిధులు కొడూరు పట్టణ ప్రాంతంలో శనివారం ఏ ఆసరా లేకుండా ఫుట్ పాత్ ల మీద , బస్ షెల్టర్‌లలోన ,రైల్వేస్టేషన్ లోను, రోడ్డుపక్కన షాపుల ముందు ఆలయ పరి సరాలలో దుప్పటి కూడ లేకుండ నిద్రిస్తున్న అనాథలను, అభా గ్యలను గుర్తించి వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. సహాయం చేసేందుకు సహక రించిన చిన్న సహాయం ట్రస్ట్ సంస్థకు అన్నివేళలా రుణపడి ఉంటా నని సుబ్బ రామరాజు తెలియజేశారు. ట్రస్ట్ సభ్యులకు అభినందనలు తెలిపారు.



వృద్ధురాలికి దుప్పటి కప్పుతున్న సుబ్బరామరాజు



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

వాహనాల తాత్కాలిక పార్కింగ్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి సహకారంతో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మౌలిక వసతులతో తాత్కాలిక వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు వైసిపి మైనార్టీ నేత బేపారి మహమ్మద్ ఖాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్ బాషా తెలిపారు. గతంలో ఇక్కడే పార్కింగ్ చేసుకొంటున్న వాహనాలు ఎక్కడ పడితే అక్కడ వారి ఇష్టను సారంగా పెట్టడంతో అటు విద్యార్థులు, ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతుండే వారని పేర్కొన్నారు. ఈ సమస్యలను జిల్లా అధికారులు దృష్టికి తీసుకువెళ్లారన్నారు. సత్వరమే స్పందించిన అధికారులు వాహనాలను ఇక్కడ పార్కింగ్ చేయకూడదని మైదానం నుంచి తీసివెయ్యాలని వారికి హెచ్చరించారు. మైనార్టీ ఇతర నాయకుల సహకారంతో ఎమ్మెల్యే ఎదుట వారి ఆవేదనను వ్యక్తం చేశారు. వాహన యజమానులు, డ్రైవర్లు, ఇబ్బందులను గుర్తించి సంబంధిత శాఖ అధికారులతో చర్చించామన్నారు. ఈ చర్చలలో స్కూలుకు వచ్చే విద్యార్థులకు, బోధించే ఉపాధ్యాయులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా పోలీసు, విద్య శాఖ అధికారుల సూచనల ప్రకారం వాహనాలను పార్కింగ్ చేసుకొనే వెసలుబాటు కల్పించారు. వాహన యజమాను దారులు కూడా బాధ్యతగా వ్యవహరించి మైదానం నందు ఎటువంటి అసాంఘిక కార్యకలాపాల జరగకుండా అడ్డుకట్ట వేసేందుకు పోలీసు శాఖకు సహకరించాలని వారికి సిఐ సుధాకర్‌రెడ్డి సూచించారు. వాహనాల పార్కింగ్ కోసం సూచించిన చోట ముల్ల కంపలు,చెట్లు ఉండడంతో ప్రాంతాన్ని చదును చేసి తమకు పార్కింగ్‌కు అనువుగా ఉండే విధంగా ఏర్పాటు చేయించాలని వాహనదారులు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని కోరారు. ఎమ్మెల్యే మైదానం చదును చేయించడంతో పాటు అక్కడ ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా సిసి కెమెరాలు, విద్యుత్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారన్నారు.



దాతను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ బృందం

విద్యార్థులు ఓ లక్ష్యంతో ముందుకు వెళ్లాలి

ప్రజాశక్తి-పీలేరు

విద్యార్థులు ఓ లక్ష్యంతో ముందుకు వెళ్లినప్పుడే వారు తమ గమ్యాన్ని చేరుకోవడం సాధ్యమని ఎఫ్‌బిఎస్‌ఎల్ మేనేజింగ్ డైరెక్టర్, అమాక్స్ సిఇఒ, యాక్స్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ జి.దశరథ రెడ్డి తెలిపారు. శనివారం పీలేరు మండలం వేపులబైలు పంచాయితీ, జంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితానికి ఒక అర్థం, పరమార్థం, విలువ ఉంటుందని, వాటిని గుర్తించి ఎదగాలని సలహా ఇచ్చారు. విద్యార్థులు ఏదో ఓ రంగంలో రాణించడానికి ఓ గురి అంటూ ఉండాలని, దానికోసం నిరంతర కృషి, పట్టుదలతో సాధన చేస్తూ విజయం సాధించాలని సూచించారు. 10వ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి, తాము చదువుతున్న పాఠశాలతో పాటు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, తల్లిదండ్రులకు కూడా మంచి పేరు, ప్రఖ్యాతులు తేవాలని తెలియజేశారు. విశ్రాంత సబ్ ట్రెజరీ ఆఫీసర్ పివి రమణ మాట్లాడుతూ దాతలను స్ఫూర్తిగా తీసుకుని విద్యతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా ఉండాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించిన వారు ఎందరో మహోన్నత స్థాయికి ఎదిగారని వారిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా దశరథరెడ్డి తమ సంస్థ ద్వారా పాఠశాలకు రూ.60,000 విలువచేసే కంప్యూటర్, కలర్ ప్రింటర్, బీరువా వితరణ చేశారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెడ్డప్ప అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి నాగభూషణంరెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ వీరయ్య, ఉపాధ్యా యులు షరీఫ్, రమణ, రేణుక, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఇంద్రజాలం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని కోళ్ళబైలు పంచాయతీ అమ్మచెరువు మిట్టలోని వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమంలో మెజిషియన్ సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంద్రజాలం ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాల్గొన్న మెజిషియన్ సురేష్ , పరిపూర్ణబోధకులు బ్రహ్మానందరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ డి.జి.రాంమూర్తిలకు పాఠశాల పిల్లలు పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి ప్రత్యేక్య పాఠశాల , వృద్ధాశ్రమం కార్యక్రమాల గురించి వారికి వివరించారు. హెడ్ కానిస్టేబుల్ మాట్లాడుతూ వెలుగుసంస్థ చాల మంచి కార్యక్రమాలు నిర్వహిస్తుందని , ముఖ్యంగా విభిన్న ప్రతిభావంత పిల్ల లను ప్రేమాభిమానంతో చూసు కుంటోందని కొనియాడారు.వెలుగు సెక్రటరీయం.ఉదయమోహన్‌రెడ్డిని అభినందించారు.కార్యక్రమంలో చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు.



మెజిషీయన్ రమేష్‌కు మెమొంటో అందిస్తున్న అతిథులు



రేషన్ షాపును పరిశీలిస్తున్న డివైస్ రఘురాం

సకాలంలో నిత్యావసరాలు పంపిణీ చేయండి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని లబ్దిదారులకు సకాలంలో అందజేయాలని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి రఘురాం పేర్కొ న్నారు. శనివారం లక్కిరెడ్డిపల్లిలో 11వ షాపును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాదిక అమృత మహోత్సవంలో కార్యక్రమంలో భాగంగా ప్రతి రేషన్ షాపును తనిఖీ చేస్తున్నట్లు ఆయన తెలి పారు. రేషన్ షాపులో వంతులు, నాణ్యత ప్రమాణాలు లబ్ధిదారులకు అందించే విధానాన్ని ఆయన గమనించారు. సంక్రాంతికిపండగకి కందిపప్పు, పంచదార అందిస్తున్నామన్నారు. బియ్యము, కందిపప్పు ,చక్కర లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో కొత్తగా 2464 రేషన్ కార్డులు మంజూరయ్యాయని, వారికి కూడా నిత్యవసర సరుకులు అందించాలని తెలిపారు. జనవరి ఒకటో తేదీ నుంచి సరుకులు లబ్ధిదారునికి కచ్చితంగా అందించాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాసులు, ఎన్ఫోర్స్మెంట్ డిటి ఉస్మాన్‌సాబ్, డీలర్ లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

కలకడ సిఐగా పి.నాగేంద్ర

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా పి.నాగేంద్ర బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సురేష్ రెడ్డి పోరుమామిళ్లకు బదిలీ కావడంతో గత నెల రోజులుగా సిఐపోస్టు ఖాళీగా ఉండటంతో ఎట్టకేలకు శనివారం కడప ఎసిబిలో సిఐగా విధులు నిర్వహిస్తున్న నాగేంద్ర బాధ్యత చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాఅండ్‌ఆర్డర్ పై ప్రత్యేక దృష్టి సారి స్తానని, రోడ్డు భద్రత నియమాలను పాటించ కుంటే చర్యలు తప్పవని అన్నారు. మండలంలో జూదం, పేకాట, నాట సారా తయారీ, చోరీ లపై ప్రత్యేక దృష్టి సారించి వాటి నియంత్రణకు కృషి చేస్తానన్నారు.



కలగడ సిఐగా బాధ్యతలు చేపట్టిన పి.నాగేంద్ర



ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలు

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలం కోనంపేటలో నెహ్రూ యువకేంద్ర సహకారంతో శ్రీ వెంకటేశ్వర యూత్ డెవెల్పమెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమల వెంకటేశ్వర, బాలాజీలు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఏడు టీమ్‌లు పాల్గొనగా కోనంపేటటీమ్ విన్నర్స్, దప్పేపల్లిటీమ్ రన్నర్స్‌గా నిలిచారు. విన్నర్స్‌కు రూ.2000లు ,రన్నర్స్‌కు రూ.1000 రూపాయల నగదు బహుమతులతో పాటు మొమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం ఉన్న క్రీడా కారులు ఉన్నారని వారి ప్రతిభను గ్రామ పెద్దలు, యువజన సంఘాలు గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. క్రీడల పట్ల యువకులు కూడా ఆసక్తిని కనబరచాలన్నారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆనందాన్ని పొందగలమని పేర్కొన్నారు. నెహ్రూయువకేంద్రం ద్వారా ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘ సేవకులు రామకృష్ణయ్య, విడ్స్ ప్రతినిధి పవన్ కుమార్, యువకులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు ఆదర్శ పాఠశాల విద్యార్థులు నెల్లూరులో జరిగిన అండర్-13 స్టేట్స్ లెవల్‌సూపర్ సెవెన్ క్రికెట్ పోటీలలో ఆదర్శ పాఠశాల విద్యార్థులు షేక్‌సలాం, వినయ్ చందర్ సాయి తృతీయ స్థానంలో నిలిచి ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ కవిత, పిడి ముషాహిద్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులు అభినందించారు.

పలువురు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పిటిఎం మండలంలోని పట్టంవాళ్ళపల్లి సచివాలయ పరిధిలోని ఆగ్రహారం టిడిపి కార్యకర్తలు శనివారం ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. కందుకూరు ఉపసర్పంచ్ శంకర ఆధ్వర్యంలో టిడిపి కార్యకర్తలు వైసిపిలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేవిధంగా అధికారులు, వాలంటీర్లు పని చేయాలన్నారు. రాబోయే 2024 ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి మహమ్మద్, ఎంపిడిఒ గిరిధర్‌రెడ్డి, ఉంగరాల శివన్న, జడ్పిటిసి కందుకూర సర్పంచ్ రహ మతుల్లా, పటంవాండ్లపల్లి సర్పంచ్ శీనా, వైస్ ఎంపిపి శోభశంకర, లక్ష్మీపతి ఎంపిటిసి కేశవ, మండల కన్వీనర్ సుబ్బరాం, జిల్లా ప్రచార కార్యదర్శి అయూబ్ బాషా, బూర్లపల్లి సర్పంచ్ సుబ్బిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



టిడిపి కార్యకర్తలను వైసిపిలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని స్థానిక గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దగ్గర రెడ్డివారిపల్లెకి చెందిన రైతు సుబ్బ రాయుడు (50)శుక్రవారం రాత్రి అనుమానాస్థితిలో మృతి చెందారు. పొలాలకు వెళ్తున్న రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో, కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని పరి శీలించారు. అనుమానంతో పెద్దమండ్యం పోలీ సులకు ఫిర్యాదు చేశారు. శవపరీక్ష కోసం మదనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలిం చారు. మృతికి కారణాలు తెలియాల్సి వుందని, మృతిపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతి చెందిన సుబ్బరాయుడు